బ్రహ్మోత్సవాల వేళ.. వసతులు లేవాయె

- ఏర్పాట్లు చేయడంలో అహోబిలం దేవస్థానం నిర్లక్ష్యం
- బ్రహ్మోత్సవాల ముగింపునకు మిగిలింది 4 రోజులే
- తాగునీరు, గదుల కొరత, మరుగులేని స్నాన ఘట్టాలు
- వీధుల్లోనే సామాన్యుల జాగారం





భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునే కోనేరు దుస్థితి,ఎగువ అహోబిలంలో దేవస్థానం ఎదుట అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

ఆళ్లగడ్డ: అహోబిలం బ్రహ్మోత్సవాలు మొదలై వారం రోజులు అవుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో ముగియనున్నా సౌకర్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, మఠం ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల బడ్జెట్ విడుదల చేసుకుంటున్నారే కానీ వాటిని ఖర్చు చేసే ప్రణాళికల్లో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరి క్షణంలో హడావుడి నిర్ణయాలతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లా స్థాయి అధికారులు రెండు పర్యాయాలు ఏర్పాట్లపై సమీక్షించారు. బ్రహ్మోత్సవాలు మొదలయ్యేలోపు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చూస్తుంటే భక్తులకు కనీస అవసరాలు కల్పించడంలో విఫలం అయినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే..

బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ.2 కోట్లు విడుదల చేసినట్లు సమాచారం. ఆయా పనులను ఎప్పటి నుంచే చేపడుతున్న వారికి అప్పగించకుండా కొత్త వారికి అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది. పనులు చేసే వారి దగ్గర అవసరమైన వస్తువులు లేకపోవడంతో వారు మరొకరి నుంచి కిరాయికి తెచ్చి వేయడం,నాసిరకంగా చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్రహ్మోత్సవాలు మొదలై వారం అయినా ఎగువ అహోబిలంలో భక్తులకు నిలువ నీడ కోసం కనీసం ఒక్క సామియానా కూడా ఏర్పాటు చేయలేదు. మరుగుదొడ్లు అస్సలు ఏర్పాటు చేయలేదు. దిగువ అహోబిలంలో ఇప్పటి వరకు కోనేటికి నీరు విడుదల చేయలేదు. మంచినీటి ట్యాంకర్లు ఏర్పాట్లు చేయలేదు. క్షేత్రానిని నిత్యం వేలాది వాహనాలు వచ్చే రోడ్లు సైతం సరైన సమయానికి పూర్తి చేయకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రహదారులను చూసి విస్మయానికి గురవుతున్నారు.



ఎగువ అహోబిలంలో నీడ కూడా ఏర్పాటు చేయని దృశ్యం

భక్తుల సంఖ్య పెరిగినా సౌకర్యాలేవి?

ప్రపంచంలోని ప్రసిద్ధి చెందిన 108 వైష్ణవ క్షేత్రాల్లో అహోబిలం ఒకటి. మార్చి 3వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. మరో నాలుగు రోజుల్లో ఉత్సవాలు ముగియనుండగా ప్రధాన ఘట్టాలైన రథోత్సవం,కల్యాణోత్సవం, గరుడోత్సవాలు ఉండడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వీటిని తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశ విదేశాలకు చెందిన భక్తులు భారీగా రావచ్చని దేవస్థాన అధికారులు భావిస్తున్నారు. భక్తుల సంఖ్య పెరుగుతుందే కాని వసతలు కల్పించడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భక్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.



దిగువ అహోబిలం దేవాలయం

ప్రధాన ఆలయాల ముస్తాబుతోనే సరి

ఏటా బ్రహ్మోత్సవాలు మొదలయ్యే సమాయానికి నెల ముందు నుంచే ప్రణాళికలు రూపొందించుకుని అందుకు అవసరమైన బడ్జెట్‌కు ప్రపోజల్ పెట్టి పనులు అప్పగించేవారు. అయితే ఈ ఏడాది ఎప్పుడు లేనిది బ్రహ్మోత్సవాలు మొదలైనా ఇంకా ఏ పనులు ఎవరికి అప్పగించాలా అని చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. అనుభవం లేని వారికి పనులు అప్పగించడంతో నాసిరకంగా చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తులకు వసతి, నీటి సౌకర్యం లభించడంలేదు. తాత్కాలిక పందిర్లు కేవలం గర్భగుడి చుట్టు మాత్రమే వేశారు. దీంతో భక్తులు కాటేజీలు, దేవాలయాల గోడ నీడ, అన్నసత్రాల ఆవరణలు, చెట్లు, ఖాళీ ప్రాంతాల్లో సేదతీరుతున్నారు. తాగునీటి ట్యాంకులు ఆదివారం వరకు ఏర్పాటు చేయలేదు.

లక్ష్మీ పతి.. ఏదీ వసతి?



దేవస్థానం ఆధ్వర్యంలో సామాన్య భక్తుడు సేద తీరేందుకు ఒక్క భవనం కూడా లేదు. ఉన్న ఒక్కటి ఈ టీటీడీ గెస్ట్‌హౌస్. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను బ్రహ్మోత్సవాలకంతా మరమ్మతులు చేయిస్తారని ఆశతో ఎదురు చూశారు. కాని పట్టించుకోకపోవడంతో సామాన్య భక్తులు వసతి లభించడం కష్టంగా మారింది. దీంతో దాదాపు భక్తులందరు దేవాలయం ఎదురుగా మాడ వీధుల్లోని రోడ్డుపైన సేద తీరాల్సిన పరిస్థితి దాపురించింది.



గోవిందా.. చూస్తున్నావా..?

నిత్యం వేలాదిగా తరలివచ్చే భక్తులకు స్నానపు గదులు కొరత వేధిస్తోంది. తాత్కలికంగా ఏర్పాటు చేసినా దుస్తులు మార్చుకునేందుకు తడికలు కూడా అడ్డు పెట్టకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో చెట్ల చాటుకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి.

శ్రీ హరి.. పనులు సరి సరి



బ్రహ్మోత్సవాలు మొదలు మే నెలలో నరసింహ జయంతి వరకు ఉండాల్సిన చలువ పందిరి ఇది. అయితే పందిరి వేసిన మరుసటి రోజే తడికలు అంతా చిరిగిపోయి బొక్కలు పడడంతో భక్తులు, దేవస్థాన సిబ్బంది ఆశ్చర్యానికి గురవుతున్నారు. గత ఏడాది కన్నా 10 శాతం ఎక్కువగానే నగదు ఇచ్చినట్లు సమాచారం. రెండు రోజులకే ఇన్ని బొక్కలు పడితే మరో మూడు నెలలకు ఈ తడికలు నిలుస్తాయా అని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నా దేవస్థాన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలపెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. జూన్ 8,9,10 తేదీల్లో పెద్దమ్మ దేవర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న, గ్రామ పెద్దలు తెలిపారు. మే 11న అమ్మవారికి ముడుపు కడుతున్నందున అప్పటి నుంచి ఎలాంటి బలులు, మొక్కులు చెల్లించే అవకాశం లేదని.. మొక్కులు ఉన్న వారు ఆ తేదీలోగా చేసుకోవాలని సూచించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో స్పందన అంధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 20 మంది నిరుపేదలైన దివ్యాంగులకు రూ.2వేల విలువ గల నిత్యావసర సరుకులను తాలూకా పోలీసు స్టేషన్ ఎస్‌ఐ దానమ్మ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా వికలాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురహరిరావు ఆదివారం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ దానమ్మ మాట్లాడుతూ నిరుపేద వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. డీపీ మస్తాన్‌వలి, జహరుద్దీన్, జహీరా, గుర్రప్ప, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అర్పణాల పండుగ



ప్రార్థనలు చేస్తున్న బిషప్ జార్జి కొర్నెలి

నంద్యాల(న్యూటౌన్): దశమ భాగం దేవుని సొమ్ము అని, ఆ భాగం దేవునికే చెల్లించాలని నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ది రైట్ రెవరెండ్ జార్జికొర్నెలి అన్నారు. ఆదివారం పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ (ఆల్‌సెయింట్ చర్చి) కోత పండుగ (అర్పణాల పండు గ) ను డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్ గురువుల ఆధ్వర్యంలో సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాల య్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఉద యం 7గంటలకు గుడిచుట్టూ ప్రదక్షిణ నిర్వహి ంచి ప్రత్యేక కీర్తనలు పాడుకుంటూ ఆలయంలోకి చేరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిషప్ జార్జి కొర్నెలి మాట్లాడుతూ ఏ డాదికి ఒకసారి ఈ అర్పణాల పండుగను జరుపుకుంటామని, క్రీస్తు ద్వారా పొందిన మేలును దశమ భాగంలో క్రైస్తవులు ధనం, ధాన్యం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు విజయ్‌కుమార్, జోయల్ పాల్గొన్నారు.

నివాళి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రాయల్ సుభాషచంద్రబోస్ అలియాస్ రవన్న 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోస్ విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితుడై దళాలకు కమాండర్‌గా పని చేస్తూ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక య్యారన్నారు. 48 సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితాన్ని గడు పుతూ నిరాడంబర జీవితంతో విప్లవ యోధుడిగా రాజకీయాలకు మార్గదర్శకత్వం వహిస్తూ ఆదర్శ నాయకుడన్నారు. రాంబాబు, ఆనంద్, ఫరూక్, చంద్రపాల్, శంకరయ్య పాల్గొన్నారు.

మత్తయి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు గ్రామంలో ఆదివారం పరిశుద్ధ మత్తయి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ జార్జి కొర్నెలి ముఖ్యఅతిథిగా హాజరై దైవ సందేశం ఇచ్చారు. వేడుకలను పురస్కరించుకొని రెండు రోజుల పాటు సీఎస్‌ఐ సంఘస్తుల ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. పాస్టర్లు వరప్రసాదరావు, ఆశీర్వాదం, జాషువా కుమారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవ వేడుకలు



శ్రీజగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో ఆలయం, పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచంలోనే రెండో దేవాలయమైన శ్రీ జగజ్జనని ఆలయ వార్షికోత్సవం నాలుగో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అంతకుముందు నవావరణ పూజ విధితో శ్రీ చక్రార్చన , భక్తుల నుండి సేకరించిన వివిధ రకాల కూరగాయలు పూలు, పండ్లతో ఆలయాన్ని అలంకరించారు అనంతరం మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు



విజేతగా నిలిచిన ఉమ్మడి జిల్లాస్థాయి జట్టు

నంద్యాల(న్యూటౌన్): కబడ్డీ సబ్ జూనియర్ ఉమ్మడి జిల్లా స్థాయి బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీరెడ్డి తెలిపారు. 34వ సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీలను కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు శివశంకర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు పాల్గొన్నారు.

సమాన హక్కుల కోసం ఉద్యమించండి



మాట్లాడుతున్న దుర్గాభవానీ

నంద్యాల(న్యూటౌన్):మహిళలకు గౌరవంగా జీవించే హక్కు ఒకరిచ్చేది కాదని, మన హక్కు అని.. మహిళలకు రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా నిరుపయోగంగానే ఉంటున్నాయని, సమాన హక్కుల కోసం ఉద్యమించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. దుర్గా భవానీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై దాడులు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. డాక్టర్ అరిఫాభాను, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు సుశీలమ్మ, సరళమ్మ, అలిమా పాల్గొన్నారు.

ఆలయానికి నూతన ద్వారబంధాలు





బాలాజీ కల్యాణ మండపంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, కొత్తగా ఏర్పాటు చేసిన ద్వార బంధాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో వెలసిన శ్రీమతి కొట్టె సుబ్బమ్మ బాలాజీ మర్చంట్ కల్యాణ మండపంలో కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామి, సీతారాముల వారి ఆలయాలకు నూతన ద్వారబంధాలు ఏర్పాటు చేశారు. ఈ ద్వారబంధాన్ని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు కుంభాభిషేకం, శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్లకు శాంతికల్యాణం, శ్రీరాముల వారి కల్యాణం ఏకకాలంలో నిర్వహించారు. దాతలు పాలూరు రవికుమార్, శ్రీలక్ష్మీ దంపతులు, ఆరవేటి రాజారత్నం, లక్ష్మీకుమారి దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.

పెద్దవంగలి దస్తగిరి స్వామి హుండీ లెక్కింపు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరి స్వామి హుండీ కానుకలను ఆదివారం లెక్కించారు. 2024 ఉరుసు నుంచి ఇప్పటి వరకు రూ.4,52,230 నగదు, 11.600 కేజీల వెండి కానుకల ద్వారా వచ్చినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. అలాగే 168 కేజీల చిల్లర నాణేలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న ఉరుసులో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామంలో 10 సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. లక్ష, మసీదు ఇమాంకు ఏడాది జీతం రూ.26 వేలు, ఉరుసు నిర్వహణకు రూ.2 లక్షలు, గతేడాది గ్రామంలో నిర్వహించిన పీర్ల పండుగకు అయిన ఖర్చు రూ.80 వేలు చెల్లించినట్లు తెలిపారు. గతంలో హుండీ కానుకలు సుమారు రూ.6 లక్షలు దుర్వినియోగం అయినట్లు కమిటీ సభ్యులు కొందరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఉరుసు పూర్తయిన తరువాత విచారించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఉరుసు సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి లేదని, నిర్వహించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్రాహ్మణులకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలోని బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బ్రాహ్మణ జనాభా 4 శాతం ఉన్నప్పటికీ ప్రస్తుత శాసన సభలో బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం లేదన్నారు. ఇప్పటికైనా శాసనమండలిలో బ్రాహ్మణులకు అవకాశమివ్వాలని కోరారు.

యాళ్లూరులో కార్డెన్ సెర్చ్



ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు చోట్ల అనుమానిత ప్రాంతాల్లో సోదాలను నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటప్రసాద్ మాట్లాడుతూ..శాంతియుతంగా జీవించాలని సూచించారు.సమస్యలనుశాంతియుతంగా పరిష్కరించుకోవాలని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు

25 రోజులకే ఎస్‌ఐ బదిలీ



ఎస్‌ఐ హనుమంతురెడ్డి

దొర్నిపాడు: బాధ్యతలు స్వీకరించిన 25 రోజులకే దొర్నిపాడు ఎస్‌ఐ హనుమంతురెడ్డి బదిలీపై వెళ్లారు. ఫిబవరి 12వ తేదీ విధుల్లో చేరిన ఆయన 10రోజులు శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలం బందోబస్తుకు వెళ్లారు. దీంతో ఆయన సీట్‌లో కేవలం 15రోజులే మాత్రమే కూర్చున్నారు. ప్రస్తుతం ఆయన జొన్నగిరి మండలానికి బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్ సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా హనుమంతురెడ్డిని ఎస్‌ఐగా నియమించారు. గత 8 నెలల్లో ముగ్గురు ఎస్‌ఐలు మారడం చర్చనీయాంశంగా మారింది. మరి దొర్నిపాడుకు ఎవరూ వస్తారో వేచిచూడాల్సిందే.

వాల్మీకులను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న బోయ పులికొండన్న

నంద్యాల(అర్బన్): వాల్మీకులను విమర్శించడం ఎస్టీ నాయకులకు తగదని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న అన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా చేర్చవద్దని చెప్పకూడదని, వారి డిమాండ్లు ప్రభుత్వానికి విన్నవించుకోవాలన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వాల్మీకి సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవగాహన లేని వారు కులంపేరుతో మాట్లాడటం సబబు కాదన్నారు. వాల్మీకుల న్యాయమైన డిమాండ్లపై మాట్లాడే వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. సమావేశంలో నాయకులు బోయసుబ్బరాయుడు, రాజునాయుడు, శంకర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫీజు పోరును విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ యాదవ్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ యువత ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మాధురి గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.4,100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలని, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు రూ.18వేల కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందని గుర్తు చేశారు. జగన్ హయాంలో రూ.8వేల కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసిందన్నారు. పేద విద్యార్థుల తరఫున పోరాటం చేస్తామని చెప్పారు. హిదయతుల్లా, అబ్దుల్లా, రంగస్వామి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



హరీష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన దండే రాజమహేంద్రారెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరామర్శించారు. 10 రోజుల క్రితం రాజమహేంద్రారెడ్డి కుమారుడు హరీష్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బ్రిజేంద్రారెడ్డి కాకరవాడ గ్రామానికి చేరుకుని కుటుంబ పెద్ద దండే ఆదినారాయణరెడ్డితో పాటు దండే పార్థ సారథిరెడ్డిలను పరామర్శించారు. జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ గజ్జెల క్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నూరు భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అప్సా నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన అసోసియేషన్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ఏపీ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ (అప్సా) నూతన కమిటీ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఆదివారం రాయలసీమ రీజియన్ అధ్యక్షుడు దండె దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ నూతన కమిటీని అధికారికంగా ప్రకటించి ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశామన్నారు. నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడిగా బత్తిన వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడిగా బాలా అకాడమీ రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజరావు, సుధాకర్, నంద్యాల పట్టణ గౌరవాధ్యక్షుడిగా రసూల్ ఆజాద్, అధ్యక్షుడిగా సమతా బాలచంద్రుడు, కార్యదర్శిగా శ్రీనివాస్‌పాండే, న్యాయమతుల్లా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. అప్సా రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, మురళీమోహన్, పడకండ్ల సుబ్రహ్మణ్యం, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మట్టితవ్వకాలు ఆపాలి



చెరువులో మట్టితవ్వకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

రుద్రవరం: చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే ఆపడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోటకొండ చెరువు నుంచి కొంతకాలంగా కూటమి నాయకులు యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు. చెరువు అంతర్భాగంలో ఆరు నుంచి 8 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వి భారీ వాహనాల్లో తెలుగు గంగ ప్రధాన కాల్వకట్ట వెంట నంద్యాల, గాజులపల్లి వరకు తరలిస్తున్నారు. తెలుగుగంగ ప్రధాన కాల్వకట్టపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కట్టంతా దెబ్బతిని దుమ్మురేగుతోంది. ఆ దుమ్ము కోటకొండ నుంచి గాజులపల్లె వరకు రైతులు సాగుచేసిన వేలాది ఎకరాల వరి, మినుము, మొక్కజొన్న, కొర్ర, అరటి వంటి పంటలపై పడి పూర్తిగా దెబ్బతింటున్నాయి. రైతులు సమస్యను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం కోటకొండ చెరువు వద్దకు వెళ్లి మట్టి తవ్వకాలను ఆయన పరిశీలించారు. కొంతకాలంగా 30 నుంచి 40 భారీ టిప్పర్లతో రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని తెలిపారు. పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ డీఈ, ఈఈలతో మాట్లాడామన్నారు. ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారన్నారు. మట్టి తవ్వకాలను నిలిపివేసి బాధిత రైతులను ఆదుకోవాలని.. లేకపోతే తెలుగుగంగ కాల్వకట్టపైన్నే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆదివారం తాము వస్తున్నామని తెలిసి కూటమి నాయకులు ఉదయం 10 గంటలకు మట్టితవ్వకాలను నిలిపివేసి దారివెంట దుమ్ములేకుండా నీళ్లు పోయడం చూస్తుంటే అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతున్నాయన్నారు. ఆయన వెంట గంధం రాఘవ రెడ్డి, సర్పంచ్ వెంకటేష్ ఉన్నారు.